ఓపెన్ స్కూల్ గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం 2025-26కు సంబంధించి ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈనెల 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

శిథిలం.. రబ్బర్ సీల్స్...!

సుంకేసుల డ్యాం రేడియల్ గేట్స్ రబ్బరు సీల్స్ శిథిలావస్థకు చేరాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. 100 - 150 క్యూసెక్కులు లీకేజీలు అవుతున్నాయి. ప్రాణ జలమైన తుంగభద్ర జలాలు కడలిపాలు అవుతున్నాయి. గేట్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టరుతో ఒప్పందం కూడా చేసుకున్నారు. కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడంతో రబ్బరు సీల్స్ మరమ్మతులు చేయడం కష్టంగా మారిందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. మరమ్మతులు చేయకపోతే రాబోయే వేసవిలో నగరానికి తాగునీటి కష్టాలు తప్పవని అంటున్నారు.

- సుంకేసుల గేట్ల నుంచి రోజుకు 100-150 క్యూసెక్కులు లీకేజీ
- కర్నూలు నగరానికి వేసవి తాగునీటి కష్టాలు తప్పవు
- మరమ్మతులకు రూ.40 లక్షలు
- నీటి నిల్వతో రిపేరీ అసాధ్యం అంటున్న నిపుణులు



సుంకేసుల డ్యాం రేడియల్ గేట్ల రబ్బరు సీల్స్ శిథిలం కావడం వల్ల వృథాగా పోతున్న తుంగభద్ర జలాలు

కర్నూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) రాయలసీమ జిల్లాల్లో అతిప్రాచీనమైన సుంకేసుల బ్యారేజీ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర-పెన్నా నదులను అనుసంధానం చేస్తూ నావిగేషన్ (జల రవాణా) లక్ష్యంగా కర్నూలు రూరల్ మండలం సుంకేసుల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై సుంకేసుల బ్యారేజీ, అనుసంధానంగా కేసీ కాలువ నిర్మాణం 1861లో చేపట్టి 1863-1870 మధ్య పూర్తి చేశారు. భారతదేశంలోనే తొలి ట్రాన్స్-బేసిన్ రవాణా ప్రాజెక్టు ఇది. 165 ఏళ్ల చరిత్ర కలిగిన కేసీ కాలువకు 'ప్రపంచ వారసత్వ నీటిపారుదల కట్టడం (వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్)'గా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. పాలకుల నిర్లక్ష్యం, కర్నూలు నగరానికి తాగునీటి ప్రత్యామ్నాయ వనరులు లేకపోవడం, అత్యాధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా మరమ్మతులు చేయడంలో అలసత్వం.. వెరసి సుంకేసులు బ్యారేజీ భద్రత ప్రశ్నార్థకంగా మారబోతోంది. 15 ఏళ్లకు పైగా శిథిలమైన రబ్బరు సీల్స్ మరమ్మతులు చేయకపోవడంతో తుంగభద్ర జలాలు వృథాగా పోతున్నాయి.

రూ.40 లక్షలు మంజూరు చేసినా..

గేట్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్వీ ఇంజనీరింగ్ సంస్థ టెండర్లు దక్కించుకొని ఒప్పందం కూడా చేసుకుంది. మరమ్మతులు చేయాలంటే ప్రస్తుతం వరద కొనసాగుతోంది. ఆ తరువాతైనా చేద్దామంటే కర్నూలు నగరం తాగునీటి అవసరాల కోసం 1.2 టీఎంసీలు 365 రోజుల కోసం నీరు నిల్వ ఉంటుండడంతో గేట్లు మరమ్మతులు ప్రశ్నార్థకంగా మారింది. ఒక ఏడాదైనా తాగునీటి కోసం ప్రత్యామ్నాయం చేసుకుంటే డ్యాం గేట్లు శాశ్వత మరమ్మతులు చేసే అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఆలోచించాలని నగరపాలక సంస్థ అధికారులకు 41 లేఖలు రాసినా స్పందన లేదని జలవనరుల శాఖ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కర్నూలు కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు చర్చించి గేట్ల మరమ్మతులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కర్నూలు నగరానికి తాగునీటి ముప్పు

కర్నూలు నగర ప్రజల ప్రధాన తాగునీటి ఆధారం సుంకేసుల బ్యారేజీ. దీని సామర్థ్యం 1.20 టీఎంసీలే. ఆరు లక్షలకు పైగా జనాభా కలిగిన నగరవాసుల దాహం, అవసరాలు, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు దాదాపుగా నాలుగు టీఎంసీలు నీరు అవసరం ఉందని అంచనా. సుంకేసుల బ్యారేజీ నుంచి రోజుకు 159 క్యూసెక్కులు డ్రా చేస్తున్నారు. నగర ప్రజలకు సరిపడ నీటి నిల్వ కోసం ఎస్ఎస్ ట్యాంక్ లేకపోవడంతో సుంకేసుల జలాశయమే ఎస్ఎస్ ట్యాంక్‌గా మార్చుకున్నారు. ఫలితంగా ఏడాదిలో 365 రోజులు నీటిని నిల్వ చేయాల్సి ఉంది. తుంగభద్రకు అక్టోబరు, నవంబరు తరువాత వరదలు ఉండవు. జూలై వరకు సుంకేసుల డ్యాంలో నిల్వ చేసిన నీరే ఆధారం. గేట్ల రబ్బరు సీల్స్ శిథిలం కావడంతో 100-150 క్యూసెక్కులు వృథాగా వెళ్తున్నాయని, తాగునీటి కోసం మరో 150 క్యూసెక్కులు డ్రా చేస్తున్నారని ఇంజనీర్లు చెబుతున్నారు. రబ్బరు సీల్స్ మరమ్మతులు చేయకపోతే డ్యాం ఖాళీ అయిపోయి వేసవిలో నీటి కష్టాలు తప్పవని అంటున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి కేసీ నీటి వాటా తీసుకుందామనుకున్నా, ఈ ఏడాది గేట్లు మరమ్మతు పనులు చేపట్టనుండడంతో రబీకి సాగు, తాగునీరు ఉండకపోవచ్చు, ప్రత్యామ్నాయం చూసుకోమని ఇప్పటికే టీబీపీ బోర్డు అధికారులు జిల్లా అధికారులను హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో సుంకేసుల బ్యారేజీ గేట్ల రబ్బరు సీల్స్ సకాలంలో మరమ్మతులు చేపట్టకపోతే రాబోయే వేసవిలో నగరానికి నీటి ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నాడు.. నేడు నిర్లక్ష్యమే..



సుంకేసుల బ్యారేజీ

తుంగభద్రకు 2009లో 9లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో, ఆ వరద ఉధృతికి సుంకేసుల బ్యారేజీ మట్టి ఆనకట్ట కొట్టుకుపోయింది. ప్రాజెక్టు సహా కేసీ కాలువ ఛిద్రమైంది. ఆ రోజు నుంచి తాత్కాలిక మరమ్మతులతో నెట్టుకొట్టుస్తున్నారే తప్పా శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించలేదు. ప్రాజెక్టుకు 30 రేడియల్ గేట్లు ఏర్పాటు చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తకుండా 30 నంబరు గేటుకు స్టాప్‌లాక్ పెట్టి శాశ్వతంగా మూసివేశారు. వరద సమయాల్లో 29 గేట్లను ఎత్తడం, దించడం (ఆపరేషన్) చేస్తున్నారు. 2009 వరదకు గేట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 14 గేట్లు మరమ్మతులు చేశారు. 15 గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. రబ్బరు సీల్స్ శిథిలమవ్వడంతో గేట్లన్నీ మూసేసినా గేట్ల రబ్బరు సీల్స్ సందుల మధ్య నుంచి 100-150 క్యూసెక్కులు ప్రాణ జలాలు వృథాగా దిగువకు వదిలేయాల్సిన వస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలోనే కాదు.. విభజిత రాష్ట్రంలోనూ నాడు వైసీపీ.. నేడు కూటమి ప్రభుత్వాలు గేట్ల మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తుంది.



ధర ఎగ్‌బాకుతోంది

లబోదిబోమంటున్న వినియోగదారులు



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర రోజురోజుకు ఎగబాకుతోంది. గత సంవత్సరం ఇదే సమయానికి గుడ్డు ధర రూ.5గా ఉండేది. ప్రస్తుతం వర్షాలు వెంటాడుతుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి రోజువారి గుడ్ల ఉత్పత్తి క్రమేణా పెరుగుతోంది. గుడ్డుకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం రూ.6.50 నుంచి 7.50కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. పెరిగిన నిర్వహణ వ్యయంతో ప్రస్తుతం గుడ్డు ఉత్పత్తి వ్యయం రూ.5కు చేరుతోందని, ప్రస్తుతం ఒక గుడ్డు ధర రూ.7కు పెరగడంట్లె కొంత గిట్టుబాటు అవుతున్నట్లు పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. కరోనా తర్వాత గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయి పౌల్ట్రీ రైతులు ఇప్పటికీ కోలుకోలేదు. ప్రస్తుతం ఉన్న కోడిగుడ్డు ధర ఆశాజనకంగా ఉన్నా రైతుకు మాత్రం తక్కువే. ఈ ధర ఇలాగే ఐదు నెలల వరకు ఉంటే తమకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని పౌల్ట్రీ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య వినియోగదారులు మాత్రం గుడ్డు ధర పెరుగుతుండటంపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉల్లి రైతుకు ఊపిరి

- మెరుగవుతున్న ధర
- క్వింటానికి గరిష్ఠంగా రూ.1,289



మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ధర క్రమంగా పెరుగుతోంది. గతంలో క్వింటా కనిష్ఠ ధర రూ.100-200కు అందింది. శనివారం క్వింటా ఉల్లికి కనిష్ఠంగా రూ.621, మధ్యస్థ ధర రూ.835లు, గరిష్ఠ ధర రూ.1,289 రైతుకు అందినట్లు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఇకపై రైతులు తెచ్చే ఉల్లికి ధరలు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమ్మకానికి తెస్తున్న పంట ఉత్పత్తుల ధరలను కూడా పెరుగుతున్నాయి. వేరుశనగ కాయలకు కనిష్ఠంగా రూ.3,413, మధ్యస్థ రూ.6,271, గరిష్ఠ ధర రూ.6,62లు రైతుల చేతికి అందింది. మొక్కజొన్నలకు కనిష్ఠంగా రూ.1,029, మధ్యస్థ రూ.1572, గరిష్ఠ ధర రూ.1949లు దక్కింది. కందులకు కనిష్ఠంగా రూ.6.640లు, మధ్యస్థ రూ.6,812, గరిష్ఠ ధర రూ.6,820 పలికింది.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని తెలుగుగేరిలో ఆయన ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అత్యధికంగా పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రతి నెల పింఛన్ సక్రమంగా అందుతుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే అధికారులు స్పందించి పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుల్లమ్మ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శేషగిరి శెట్టి, క్లస్టర్ ఇంచార్జ్ నవీన్, సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణను అక్టోబరు 1న జరపాలి

రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్



నిరసన వ్యక్తం చేస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానానికి గౌరవంగా రాష్ట్ర అవతరణ దినాన్ని అక్టోబరు 1న జరపాలని కోరుతూ రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు శనివారం నిరసన తెలియజేశారు. నగరంలోని పూలబజార్‌లోగల పొట్టి శ్రీరా ములు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు నినాదాలతో తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ అరుణ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు యాభై మూడు రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణత్యాగం చేయడం వల్ల కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. తెలంగాణతో కలిసి 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, దీని వల్ల శ్రీబాగ్ ఒప్పందం వల్ల రాయలసీమకు వచ్చిన కర్నూలు రాజధాని కోల్పోయిందని అన్నారు. అప్పటి నుంచి రాయలసీమ వివక్షతకు, అన్యాయానికి గురవుతూ వచ్చిందని అన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు రాయలసీమను నిర్లక్ష్యం చేస్తూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయడం లేదని, విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. శ్రీబాగ్ ఒప్పందం అమలు చేసి సీమను అభి వృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విరసం బాధ్యుడు పాణి, ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు యోహాన్, ప్రజా పరిరక్షణ సమితి నాయకుడు డేవిడ్, హంద్రీ పరిరక్షణ సమితి నాయకుడు సుంకన్న, కో కన్వీనర్ రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేకు అవమానం!

- పింఛన్ల పంపిణీకి అందని ఆహ్వానం
- ముమ్మాటికీ ప్రొటోకాల్ ఉల్లంఘనే
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీకి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ఆహ్వానం అందలేదు. దీంతో ఎమ్మెల్యే దస్తగిరి కినుక వహించారు. దళిత ఎమ్మెల్యే కాబట్టే తనను అగౌరవపరిచేలా అధికారులు వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు... కర్నూలు మండలం పంచలింగాలలో డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం జరిగింది. దీంతో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సిరితో పాటు ఉన్నతాధికారులు పంచలింగాలకు వెళ్లి పింఛన్ల పంపిణీతో పాటు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే సంబంధిత డీఆర్‌డీఏ అధికారులు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ఎలాంటి ఆహ్వానం అందించలేదు. కనీసం సమాచారం కూడా తెలియజేయలేదు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఒక దళిత ఎమ్మెల్యేను కాబట్టే తనను అగౌరవపరుస్తున్నారంటూ శనివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రొటోకాల్ పూర్తిస్థాయిలో ఉల్లంఘించారని ఆయన ఆరోపించారు. ఈ ఉదంతంపై సంబంధికులపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాకుండా సొంత నియోజకవర్గంలో తనకు జరిగిన అవమానంపై రాష్ట్రస్థాయి అధికారులు, శాసనసభ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు

పత్తి క్వింటా రూ. 7,639

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 01 (ఆంధ్రజ్యోతి) : ఆదోనిలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు గతవారం స్వల్పంగా పెరిగినా.. మళ్లీ తగ్గాయి. శనివారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ. 7639 పలికింది. కనీస మద్దతు ధర కంటే మార్కెట్‌లో పత్తి ధరలు తక్కువగా ఉండటంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ యాప్ సాంకేతిక సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ సాంకేతిక సమస్య వల్ల మరుసటి రోజు రావాలని అధికారులు అంటున్నారు. దీంతో విధిలేక తక్కువ ధరకు మార్కెట్‌లో అమ్ముకొని నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యను పరిష్కరించి కొనుగోళ్లకు ఇబ్బంది కలగకుండా సీసీఐ పత్తి కొనాలని డిమాండ్ చేస్తున్నారు. 9743 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠం రూ. 4,019, మధ్యధరం రూ. 7,369, గరిష్ఠంగా రూ.7,639 ధరలకు కొన్నారు.



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలి



పంచలింగాలలో పంట ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ ఏ.సిరి వ్యవసాయాధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని పంచలింగాల గ్రామంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. రికార్డులో నమోదైన పంటలు వాస్తవంగా పొలాల్లో సాగుచేయబడుతున్నాయా లేదా అని కలెక్టర్ తెలుసుకున్నారు. పుల్లయ్య అనే రైతు వేసిన ఉల్లిపంటను కలెక్టర్ పరిశీలించారు. పత్తి రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న కోత వివరాలను తెలుసుకున్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మీ, అసిస్టెంట్ అధికారి సాలురెడ్డి, ఏవో రూఫస్, తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు



కాల్వబుగ్గలో కంచి పీఠాధిపతి
బుగ్గ రామేశ్వరుడికి ప్రత్యేక పూజలు 6



కళల ఖిల్లా కర్నూలు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ఘనంగా ప్రారంభమైన 'కర్నూలు ఉత్సవ్-2025' 6

కూలీపనులకు వెళ్తూ.. మృత్యు ఒడికి..
- ఆటోను ఢీకొట్టిన మినీ బస్సు
- ఇద్దరు కూలీలు దుర్మరణం
- మరో 12 మందికి గాయాలు
- కోటేకల్ గ్రామ సమీపంలో ఘటన 7

ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంపును వ్యతిరేకించాలి
- రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి

కాల్వబుగ్గలో కంచి పీఠాధిపతి



కాల్వబుగ్గ ఆలయంలోకి వస్తున్న కంచి పీఠాధిపతి

ఓర్వకల్లు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని కాల్వబుగ్గ ఆలయాన్ని కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర శంకరాచార్య స్వామిజీ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన పీఠాధిపతికి ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్, ఆలయ ప్రధానఅర్చకులు కల్లె లక్ష్మినారాయణశర్మ, ఈవోలు మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగ తం పలికారు. ముందుగా పీఠాధిపతి చిన్నకోనేరులో స్నానం ఆచరించారు. కోనేరులోనే దాదాపు 3గంటల పాటు జపం చేసుకుని భక్తులచేత ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. బుగ్గ రామేశ్వరుడికి రుద్రాభిషేకం, భ్రమ రాంబకు కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి రావడంతో ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి



ఆలయంలో ఎమ్మెల్యే గౌరు దంపతులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

● బుగ్గ రామేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దంపతులు శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామిజీని దర్శించుకుని ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన వేప చెట్టు కింద కూర్చుని పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు. పీఠాధిపతి మాట్లాడుతూ భక్తులందరూ భక్తి, సేవాభావంతో హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పిలుపునిచ్చారు. కంచి పీఠాధిపతి గోశాలలో ఉండగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్వామిజీ ఆశీస్సులు పొందారు. 1983లో భ్రమ రాంబ, బుగ్గ రామేశ్వరస్వామిని దర్శించుకున్న 69వ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువు పూజశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామీజీ భ్రమరాంబ అమ్మవారి గర్భాలయంలో శ్రీచక్ర యంత్రాన్ని ప్రతిష్టించారు. కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, తహసీల్దార్ విద్యాసాగర్, నాయకులు మోహన్ రెడ్డి, సుధాకర్‌రావు, నాగేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాల్వబుగ్గ ఆలయంలో ఎమ్మెల్యే గౌరు దంపతులను ఆశీర్వదిస్తున్న కంచి పీఠాధిపతి

అర్హులందరికీ పింఛన్ : కలెక్టర్ సిరి

● జిల్లాలో రూ.103.82 కోట్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిరి, ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు కర్నూలు కలెక్టర్ ఏ. సిరి అన్నారు. జిల్లాల్లో నవంబరులో 2,37,904 మందికి రూ.103.82 కోట్ల పింఛన్ అందజేసినట్లు పేర్కొన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి కలెక్టర్ పాల్గొని అర్హులైన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పింఛన్‌దారుల యోగ క్షేమాలను తెలుసుకొని, ప్రతి నెలా పింఛన్ అందుతోందా? అని అడిగారు. అర్హులందరికీ పంఛన్ ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ప్రతి నెల 1వతేదిన అర్హులందరికీ పింఛన్ ఇస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారెడ్డి, రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నృత్యోత్సవం ప్రారంభం



అతిథులు, ఆలయ ప్రధాన అర్చకులతో కళాకారులు

ఆళ్లగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి నవనరసింహాల నృత్యోత్సవాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్, అహోబిలం శ్రీకృష్ణ దేవరాయ బలిజ, కాపు, తెగల అన్నదాన సత్రం సంఘం అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేశారు. లక్ష్మీనరసింహస్వామిని స్తుతిస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన కన్నుల పండుగగా సాగింది. ఈప్రదర్శనలో ప్రతిభ కనపరిచిన కళాకారులను అతిథులు, గురువులు జ్ఞాపికలతో సత్కరించారు. ఇంతటి గొప్ప కార్యాక్రమాన్ని నిర్వహించిన సురేష్‌ను ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి అభినందించారు. ఈ నృత్య ప్రదర్శన రెండు రోజల పాటు కొనసాగుతుందని ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్ తెలిపారు. కథాకళి నాట్యగురువు రేణుక ప్రభాకర్, బాబు బాలాజీ, కమలా బాలాజీ, ఐశ్వర్యరెడ్డి, రామలలిత, వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.



అహోబిలం ప్రధాన అర్చక దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ సిరి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో 3 రోజుల పాటు 91 శాఖల అధికారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఐవీఆర్‌ఎస్ ద్వారా వచ్చే ప్రజాభిప్రాయ సేకరణ సానుకూలంగా ఉండేలా కృషి చేయాలన్నారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, సీపీవో భారతి, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

తుఫాన్ కంటే వేగంగా వెళ్లిపోయిన జగన్

● ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తగ్గాక ఏపీకి వచ్చిన వైఎస్ తుఫాన్ కంటే వేగంగా బెంగళూరులోని ప్యాలెస్‌కు వెళ్లిపోయాడని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ఎద్దేవా చేశారు. శనివారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఓ వైపు మొంథా తుఫాన్‌తో రాష్ట్రంలో హైటెన్షన్ వాతావరణం నెలకొని ఉంటే బెంగళూరుకు జగన్ వెళ్లిపోయాడన్నారు. తుఫాన్ తగ్గుముఖం పట్టాక ఏపీకి వచ్చి ప్రభుత్వంపై నాలుగు అర్థరహిత కామెంట్లు చేసి తుఫాన్ కంటే వేగంగా బెంగళూరుకు వెళ్లిపోయాడన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్ అండ్‌కోలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లు వారం రోజుల పాటు మొంథా తుఫాన్‌పై రేయింబవళ్లు శ్రమిస్తే.. ఇప్పుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్ దిగజారుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. బ్రతికి ఉన్న రోజులు ప్రజల కోసం ఏమైనా చేయాలే కానీ ఇలా ప్రజాకంటకంగా ఎప్పుడూ మారకూడదని జగన్‌కు హితవు పలికారు. ఐదేళ్ల చంద్రబాబు నిర్మించిన సచివాలయంలోనే పాలన సాగించిన జగన్ ఒక్క భవనాన్ని అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. మళ్లీ చంద్రబాబు సీఎం హోదాలో వచ్చాక అమరావతితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలకు జీవం పోసినట్లయిందన్నారు. కర్నూలు బస్సు దహనం ఘటనలోనూ వైసీపీ బ్యాచ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులు క్షమించరానివన్నారు. చివరకు మేధావి వర్గానికి చెందిన జూపూడి ప్రభాకర్ కూడా జగన్‌కు భజన చేయడం సిగ్గుచేటన్నారు. సినీ రంగంలో మంచి భవిష్యత్తు ఉన్న యాంకర్ శ్యామల కూడా వైఎస్ జగన్ కోసం అవకాశాలను పోగొట్టుకుంటోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత వైఎస్ జగన్, ఆ పార్టీ నేతలు ప్రభుత్వం చేస్తున్న మంచిని కూడా వక్రీకరించి, అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని గోపాలకృష్ణ హితవు పలికారు.

కళల ఖిల్లా కర్నూలు



ర్యాలీలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేశ్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్, డీఈఓ శ్యామ్యుల్‌పాల్, ఐపీఎస్ కొత్తకోట

● పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలి
● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
● ఘనంగా ప్రారంభమైన 'కర్నూలు ఉత్సవ్-2025'

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కళలు, సంప్రదాయాలు, జ్ఞాన సంపదకు పుట్టినిల్లు కర్నూలు జిల్లా అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. కర్నూలు జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేయాలని ఆయన జిల్లా ప్రజలు, మేధావులు, కళాకారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో వారం రోజుల పాటు జరిగే 'కర్నూలు ఉత్సవ్-2025' వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీజీవీ కళాక్షేత్రం, ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా కర్నూలు కలెక్టరేట్ నుంచి వెయ్యిమంది కళాకారులు, విద్యార్థులు, మేధావులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట మహాత్మాగాంధీ, ఎన్టీఆర్, తెలుగుతల్లి విగ్రహాలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, డీఈఓ శామ్యూల్ పాల్, తెలంగాణ రాష్ట్ర విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య తదితరులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు రాత్రికి రాత్రి రాలేదని, అమర జీవి పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగంతో వచ్చిందన్నారు. పొట్టి శ్రీరాములు ఆర్య వైశ్య సామాజిక వర్గానికి మాత్రమే పని చేయలేదని, ఆయన రాష్ట్రంకోసం, అన్ని సామాజిక వర్గాల కోసం, తెలుగు మాట్లాడే వారందరి కోసం ఆత్మార్పణ చేసుకున్నార న్నారు. అమర జీవి పొట్టి శ్రీరాములు స్మారకార్థం అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం 50 అడుగులు విగ్రహంతోపాటూ మ్యూజియం ఏర్పాటు చేస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ రూ.కోటి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో వారం రోజులు జరిగే కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాక్షేత్రాన్ని అభివృద్ధి చేసి కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు.

మహనీయుల జిల్లా కర్నూలు : జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు జిల్లా చరిత్ర ఎంతో గొప్పది. ఎందరో మహనీయులు ఈ జిల్లా నుంచి ముఖ్యమంత్రులుగా, ప్రధానిగా, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులుగా సేవలందించారన్నారు. దేశస్వాతంత్ర్యంలోనూ జిల్లాకు చెందిన సమరయోధులు ప్రాణాలు అర్పించారన్నారు. ఇంతటి ఘన చరిత కలిగిన జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉంది. జిల్లా ఖ్యాతిని పెంచడంలో తాను ఒక భాగస్వామిగా ఉంటాను. కర్నూలు ఉత్సవ్ పేరిట కళాకారులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయం.

ఆకట్టుకున్న వేషధారణలు

కర్నూలు ఉత్సవ్-2025 ప్రారంభోత్సవంలో భాగంగా తొలిరోజున శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు ప్రారంభించిన ర్యాలీలో పలువురు కళాకారులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. గజల్ గాయకుడు మహ్మద్ మియా తెలుగు ఖ్యాతిని చాటి చెప్పే పాటలు ఆలపించారు. శ్రీకృష్ణ దేవరాయలుగా సంగా ఆంజనేయులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా డి.ఈశ్వరయ్య, కట్ట బ్రహ్మన్నగా రాముడు, పొట్టి శ్రీరాములుగా ఎస్ఎండీ ఇనయతుల్లా ర్యాలీలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నేత పీబీవీ సుబ్బయ్య, రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, కళాక్షేత్రం ప్రతినిధులు సి.యాగంటీశ్వరప్ప, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, కె.బాలవెంకటేశ్వర్లు, కదిరి రమేష్, ఎర్రమ పాండురంగయ్య, ఎన్‌డీ క్రిష్టఫర్, పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి, టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు వీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కళాకారులు



'నృత్య, నాటక కళాశాలను ఏర్పాటుకు కృషి'



విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డీఈఓ శ్యామ్యుల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐపీఎస్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో కళా ప్రదర్శనలకు నిలయంగా ఉన్న టీజీవీ కళాక్షేత్రంలో మరో నూతన భవనం నిర్మించి అందులో నృత్య, నాటక కళాశాలను ఏర్పాటు చేస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. 'కర్నూలు ఉత్సవ్-2025'లో భాగంగా శనివారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, డీఈఓ శామ్యూల్ పాల్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలో కళలు, కళాకారులకు కొదువ లేదని, ఆదరణ కోసం వారు వేచి చూస్తున్నారని అన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కళాకారులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం నిత్యం కళలను ఆదరిస్తూ, వేలాది మందికి ప్రోత్సాహకాలు కల్పిస్తోం దన్నారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ సంగీత, నృత్య నాటక అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తమ సంపూర్ణ సహకారం అందజేస్తామని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్-2025 భావి తరాలు గుర్తుంచు కునేలా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 7 వరకు నిత్యం ఉదయం 10 నుంచీ రాత్రి 10 వరకు కళాక్షేత్రంలో ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్‌కే శర్మ, టీజీవీ కళాక్షేత్రం ప్రతినిధులు మహమ్మద్ మియా, ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, కేవీ రెడ్డి, పీపీ గురుమూర్తి, బాలవెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

● **విశిష్ట సేవకులకు సత్కారం:** కర్నూలు ఉత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని టీజీ వెంకటేశ్, బీవీ రెడ్డి, పత్తి ఓబులయ్య ఘనంగా సత్కరించారు. బీసీ రాజారెడ్డి (సామాజిక సేవ, బనగానపల్లె), కొత్తకోట శ్రీనివాసరెడ్డి (విశ్రాంత డీజీపీ, తెలంగాణ), డీఈవో శామ్యూల్ పాల్, రామకృష్ణారెడ్డి (రామకృష్ణ విద్యాసంస్థల అధినేత, నంద్యాల), ఎం.అరుణాచలం రెడ్డి (ప్రతిభ విద్యాసంస్థల అధినేత, కర్నూలు), గండ్లూరి దత్తాత్రేయ శర్మ (శతావధాని), కేసీ కల్కూర (సామాజిక సేవకులు), ఎ. రజనీబాయి (సీనియర్ రంగస్థల నటీమణి)లు సత్కారాలు అందుకున్నారు.

బీసీ స్ఫూర్తి.. తీరిన దాహార్తి

● కార్తీక మాసంలో వేలాదిగా భక్తులు
● బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత ఆర్వో ప్లాంట్లు



నల్లమలలోని బీసీ రాజారెడ్డి ఉచిత వాటర్‌ప్లాంట్ ఆవరణలో సేదతీరుతున్న భక్తులు

మహానంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీక్షేత్రంలో విలువైన వృక్ష సంపద, జంతువులకు ఆలవాలమే కాదు... శ్రీశైల మల్లన్న, మహానంది మహానందీశ్వరస్వామి క్షేత్రాలతో పాటు ఎన్నో ప్రముఖ శైవాలయాలను దర్శించుకోవాలంటే నల్లమల నుంచి తప్పకుండా వెళ్లాల్సిందే. దుర్భేద్యమైన అడవుల్లో సాగే ఈ ప్రాంతంలో దాహార్తికి మాత్రం ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడేవారు. వారి సమస్యను గుర్తించిన బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి నల్లమలలో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ క్రమంలో మహానంది మండలం దట్టమైన అటవీ ప్రాంతంలోని నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారి ప్రక్కన రూ.45 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అటు వైపుగా వెళ్ళే వాహనదారులతో పాటు దైవదర్శనం మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు అదే మార్గంలోని సర్వ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే వేలమంది భక్తులకు ఈ తాగునీటి కేంద్రం దాహాన్ని తీర్చుతోంది. రాత్రి వేళల్లో నల్లమల ఘాట్‌లో వెళ్ళే భక్తులతో పాటు వాహనదారులు బీసీ రాజారెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ పరిసరాల్లో కాసేపు సేదతీరి విశ్రాంతి తీసుకుని వెళ్తున్నారు.

దాహార్తి తీర్చాలనే



నల్లమల రహదారిలో వెళ్ళే వాహనదారులతో పాటు అటువైపుగా మహానంది, సర్వనరసింహ స్వామి ఆలయాలకు దర్శనం కోసం వెళ్ళే భక్తుల నీటి దాహార్తి తీర్చాలన్న ఆశయంతో రూ.45 లక్షలతో మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని ప్రధాన రహదారి ప్రక్కన పొలం కొనుగోలు చేసి ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసాను. ఇది అటు వైపు వెళ్ళే ప్రయాణికులతో పాటు దినసరి కూలీలకు, భక్తులకు ఉపయోగపడుతోంది. దీంతో రాత్రి వేళల్లో ఎంతో మంది సేదతీరి వెళ్లేందుకు ఉపయోగపడటం సంతోషాన్ని ఇస్తోంది. - దాత బీసీ రాజారెడ్డి



గాజులపల్లిలో ఏర్పాటు చేసిన తాగునీటి కేంద్రం

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.15 లక్షల ఆస్తి నష్టం


బీరువాలో కాలిపోయిన దుస్తులు, నగదు

ఆదోని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. పట్టణంలోని బండిమిట్ట ప్రాంతంలో శనివారం ఉదయం ఈఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బండిమిట్టలో నివాసం ఉండే వీరేష్, చిట్టెమ్మ దంపతులు పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇంట్లో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. చుట్టుపక్కల వాళ్లు గమనించి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చేలోగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని నగలు, డబ్బు, దుస్తులు, తిండిగింజలు, వస్తువులు దగ్ధమై బూడిదయ్యాయి. రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తమది పేద కుటుంబమని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు నాయకులను వేడుకున్నారు.

గడ్డివాములు దగ్ధం


గొల్లలదొడ్డిలో కాలిపోతున్న గడ్డివాములు

సి.బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. బాధిత రైతు కరువ సోమన్న కథనం మేరకు.. పశువుల మేత కోసం వెరుశనగ, కొర్ర, వరి, జొన్నతో గడ్డివాలు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కోడుమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపే మొత్తం కాలిపోయింది. రూ1.5లక్ష నష్టం వచ్చిందని ఆదుకోవాలని బాధితుడు కోరారు. స్థానికంగా ఫైర్ ఇంజన్ ఉంటే ఇలా అయ్యేది కాదని ఉన్నతాధికారులు స్పందించి గూడూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఎర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ప్యాపిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుమాను మిట్ట దగ్గర శనివారం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందినట్లు జలదుర్గం ఎస్ఐ నాగార్జున తెలిపారు. వివరాలు.. డోన్ మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన నీలప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు మంజునాథ్(17) చిగురుమాను మిట్ట దగ్గర చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కోడిని ఈకలను తొలగించే మిషన్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో కి వెళ్లగా చికిత్స నిమిత్తం డోన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ఆళ్లగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట గ్రామం ప్రతాపరెడ్డి కాలనీలో కుక్కల దాడిలో శనివారం ముగ్గురికి గాయాలయ్యాయి. వసుంధర, యశ్వంత్, మరో చిన్నారి గాయపడగా వీరిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతంలో కూడా కుక్కల దాడిలో చాలామంది గాయాల పాలైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు


నిందితులను చూపుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి సమీపంలో అక్టోబరు 28న జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తబ్రేజ్ చెప్పారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం పి. కోటకొండకి చెందిన దస్తగిరి ఆచారికి, చెల్లెలచెలిమకి చెందిన వరలక్ష్మితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. పెళ్లి అయినప్పటి నుంచి కాపురంలో కలహాలు జరిగేవి. దస్తగిరి ఆచారి నిత్యం భార్యపై అనుమానం వ్యక్తం చేసేవారు. పెద్దల సమక్షంలో పంచాయితీ, దేవనకొండ పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. రెండేళ్ల క్రితం ఇరువురు విడిపోయారు. వరలక్ష్మి కర్నూలు సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ముగ్గురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తుంది. పిల్లల కోసం కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇద్దరిలో ఎలాంటి మార్పు రాలేదు. చివరకు భర్తను హత్య చేయాలని భార్య నిర్ణయించుకుంది. హత్యకు తన సోదరులైన శేఖర్, వీరేశ్‌తో కలిసి కుట్ర పన్నింది. అక్టోబరు 28న పి.కోటకొండకు వెళ్లాలని ఒక ఆటోలో దస్తగిరి ఆచారి, వరలక్ష్మి, శేఖర్, వీరేశ్ కలిసి బయలుదేరారు. ప్యాలకుర్తి గ్రామం సమీపంలో తాగిన మైకంలో ఉన్న దస్తగిరి ఆచారి గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. పత్తికొండ రహదారిలోని పెట్రోల్‌బంకు దగ్గర అనుమానంగా ఒక ఆటోలో ముగ్గురు నిందితులు తిరుగుతుండగా పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ డివై స్వామి, ట్రైనింగ్ ఎస్ఐ మణికంఠ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంపును వ్యతిరేకించాలి



- రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి ప్రాజెక్టుపై కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలుగు రాష్ట్రాల పాలిట మరణశాసనం అయ్యేలా ఉందని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకట సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నంద్యాలకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆల్మట్టి ఆనకట్టు ఎత్తును పెంచాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అదే కనుక జరిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇక్కట్లకు గురికాక తప్పదన్నారు. ఆల్మట్టి ఆనకట్టు ఎత్తు పుంపు నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవాలన్నారు. ఆ మేరకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఆనకట్ట ఎత్తు పెంచితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆయకట్టదారులు తమ పంటలకు అవసరమైన నీరు అందకపోవడం వల్ల నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు ఆల్మట్టి ఆనకట్ట పెంపు నిర్ణయాన్ని మానుకోవాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు కుంచం వెంకటసుబ్బారెడ్డి లేఖను పంపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, దేవేంద్ర ఫడ్నవీస్‌లకు ఆయన లేఖలు పంపారు. ఆల్మట్టి ఎత్తు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆల్మట్టి ఎదుట ప్రాణత్యాగానికి సిద్ధమని కుంచం స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ మేరకు నీటి వాటాలు పక్కాగా జరగాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ట్రిబ్యునల్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కూలీ పనులకు వెళ్తూ.. మృత్యు ఒడికి..


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలు రంగవేణి తల్లి, బంధువులు

- ఆటోను ఢీకొట్టిన మినీ బస్సు
- ఇద్దరు కూలీలు దుర్మరణం
- 12 మందికి గాయాలు
- వీరిలో నలుగురి పరిస్థితి విషమం
- కోటేకల్ గ్రామ సమీపంలో ఘటన


బోయ రంగవేణి(ఫైల్)


గొల్ల నాగలక్ష్మి (ఫైల్)

ఎమ్మిగనూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పత్తి కోత పనులకు వెళ్తూ.. ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. మరో 12మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం ఎమ్మిగనూరు మండలంలోని కోటేకల్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన డ్రైవర్ కన్నయ్యతో పాటు 13మంది వ్యవసాయ కూలీలు చాకలి వెంకటేశ్వరి, చాకలి శిరీష, బోయ గుండమ్మ, బోయ శాంతి, గొల్ల కవిత, బోయ అనుసూయ, చాకలి నాగలక్ష్మి, బోయ అంజలి, బోయ కొండ నరసమ్మ, బోయ రంగవేణి, సాయి చరణ్, చాకలి మహాదేవి ఆటోలో పత్తికోత పనుల కోసం మంత్రాలయం మండలం కలుదేవకుంట గ్రామానికి బయలుదేరారు. ఆటో కోటేకల్లు గ్రామ సమీపంలో 167 జాతీయ రహదారి టర్నింగ్‌లో వస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా వస్తున్న మినీబస్సు ఆటోను ఢీకొట్టింది. ఆవేగానికి ఆటో ఎగిరి మూడు పల్టీలు కొట్టింది. అందులోఉన్న కూలీలు ఒక్కసారిగా చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో కూలీలకు రక్తగాయాలయ్యాయి. ఒక్కసారిగా ఆటో ప్రమాదానికి గురికావడం, అందులో ప్రయాణిస్తున్న కూలీలు చెల్లాచెదురుగా పడి రక్తగాయాలు కావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఆప్రాంతం క్షతగాత్రుల ఆర్తనాదాలతో మిన్నంటింది. గాయాలపాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్కడికక్కడే మృతిచెందగా..

రోడ్డు ప్రమాదంలో ఆదోని మండలం కపటికి చెందిన బోయ రంగవేణి(16) అక్కడిక్కడే మృతి చెందింది. గొల్ల నాగలక్ష్మి అలియాస్ సరస్వతి (28)తో పాటు మరో నలుగురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. నాగలక్ష్మి చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగలక్ష్మికి ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిన్నంటిన రోదనలు

ఉదయాన్నే కూలీ పనుల కోసమని మంత్రాలయం మండలం కలుకుంట గ్రామానికి బయలుదేరిన కూలీలకు రోడ్డు ప్రమాదం జరిగిందని తెలియగానే ఆదోని మండలం కపటి గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆటోలో 14మంది ఉండడంతో ఎవరెవరికి ఏమైందోనని ఆయా కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. రోడ్డు ప్రమాదంలో రంగవేణితో పాటు నాగలక్ష్మి మృతి చెందడం, మిగతా వారికి తీవ్ర రక్తగాయాలు కావడంతో వారివారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలివచ్చారు. మృతుల, క్షతగాత్రుల బంధువుల రోదనలతో మిన్నంటింది. ఇద్దరు కూలీలు మరణించడంతో కపటి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

టెంపో ఢీ.. వాహనదారుడి మృతి

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను టెంపో ఢీకొట్టగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రచ్చుమర్రి సమీపంలో శనివారం చోటుచేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. కర్ణాటకలోని రాయచూరు తాలుకా గట్టుబిచ్చాల గ్రామానికి చెందిన భీమారావు(45) బైక్‌పై పెద్దకడుబూరు మండలం ముచ్చగిరికి వెళ్తున్నాడు. బెంగుళూరు నుంచి మంత్రాలయం వస్తున్న విభిన్న ప్రతిభావంతులను తీసుకువస్తున్న టెంపో బైక్‌ను ఢీకొట్టింది. భీమారావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. భార్య అంబిక, కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా వ్యక్తి..

క్రిష్ణగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెంపాడు గ్రామానికి చెందిన రేమట సోమేశ్వరరెడ్డి (49) ఆటో బోల్తా పడడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో మృతిచెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. వెల్దుర్తి నుంచి గూడెంపాడు గ్రామానికి పుట్లూరు గ్రామానికి చెందిన ఉప్పరి వెంకట ప్రతాప్ ఆటోలో శుక్రవారం సాయంత్రం బయలుదేరారు. గూడెంపాడు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను అతివేగంతో ట్రాక్టర్ ట్రిల్లర్‌కు తగిలించడంతో ఆటో బోల్తా పడి సోమేశ్వరరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. భార్య సోమేశ్వరమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వెల్దుర్తిలో ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలుకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు రేమట కృష్ణారెడ్డి పిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ కృష్ణమూర్తి శనివారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- అదుపు తప్పి బోల్తాపడ్డ బొలెరో


నల్లమలలో బోల్తా పడ్డ బొలెరో వాహనం

మహానంది, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డ ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. మరో పది మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో గిద్దలూరు-నంద్యాల ప్రధాన రహదారిలో శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న బొలెరో దాదా ఖలందర్‌దర్గా వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మండలంలోని గాజులపల్లికి చెందిన అబ్దుల్ మజీద్(50) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 10మందికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తి రైతులకు నష్టం రాకూడదు

- మద్దతు ధర కల్పించండి : కలెక్టర్ ఏ.సిరి


మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు నష్టపోకుండా మద్దతు ధర కల్పించాలని కలెక్టర్ ఏ.సిరి జిన్నింగ్ మిల్లు ప్రతినిధులు, సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జేసీ నూరుల్ ఖమర్‌తో కలిసి జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పత్తిని బాగా ఆరబెట్టి తీసుకుని వెళితే మంచి ధర వస్తుందని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోలు చేయాలన్నారు. పత్తిని కొనుగోలు చేసిన తర్వాత వెంటనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. జేసీ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రారంభమైన రోజు నుంచి 188 గ్రామాల్లో కొనుగోళ్ల ప్రక్రియ మొదలైందన్నారు. శనివారం నాటికి 139 రైతుల నుంచి 3,012 క్వింటాళ్ల పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేశారన్నారు. మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, సీసీఐ అధికారులు, మార్కెట్ యార్డు సెక్రటరీలు సుందర్ రాజు, చంద్రమౌళి, గోవిందు, కార్నలిస్, సునీత ఉన్నారు.

మెకానిక్స్ కావలెను | FORCE MOTORS

కర్నూలుకు సమీపంలోని దూపాడులో గల ప్రముఖ FORCE MOTORS LTD. (TOOFAN) షోరూం నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన మెకానిక్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. వివరాలకు సంప్రదించండి.

YVS REDDY
Cell: 9908523189, 8886681493.

రాముడి కృపతో దేశం సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- వైభవంగా శ్రీరాముని విగ్రహావిష్కరణ


శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్, టీజీ భరత్

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాములోరి కృపతో రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం పాతనగరంలోని మెయిన్‌బజార్‌లో గల అతిపురాతన పేట రామాలయంలో జరిగిన శతాబ్ది వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారంపై 13 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధానఅర్చకుడు మాళిగి హనుమేశాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిల్కూరు నందకిషోర్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ గర్భగుడిలోని ఏకాంత రాముడ్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్‌లు దర్శించుకొని పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురంపై నెలకొల్పిన 13అడుగుల శ్రీరాముని విగ్రహానికి పూజలు చేసి ఆవిష్కరించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలులో అతి ప్రాచీనమైన పేట రామాలయం అభివృద్ధికి అన్ని విధాలా సంపూర్ణ సహకరిస్తామన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, కరివేన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, క్రెడాయ్ కర్నూలు ఛైర్మన్ గోరంట్ల రమణ, వీహెచ్‌పీ నాయకులు మాళిగి భానుప్రకాశ్, సత్యప్రియ, డి. రాంప్రసాద్ పాల్గొన్నారు.

పౌరులు బాధ్యతగా మెలగాలి


మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

కర్నూలు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పౌరులంతా బాధ్యతగా మెలిగినప్పుడే ఆదర్శమైన సమాజం ఏర్పడుతుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ డి.సోమన్న అన్నారు. శనివారం ఉస్మానియా కళాశాలలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

అనుకూలమైతే అక్కడే..!



- ఏళ్ల తరబడి ఒకేచోట కొందరు నర్సులు
- పెద్దాసుపత్రి స్టాఫ్ నర్సుల డ్యూటీ రోస్టర్‌పై విమర్శలు
- స్థానాలు మార్చాలని ఇటీవలే డీఎంఈ ఆదేశించినా అమలు కాని వైనం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సింగ్ సిబ్బంది విధులకు సంబంధించిన డ్యూటీ రోస్టర్ గందరగోళంగా మారింది. 1,200 పడకలున్న ఆసుపత్రిలో 600 మంది రెగ్యులర్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. డ్యూటీ రోస్టర్‌లో గతంలో ఎప్పుడూ లేనంతగా రాజకీయ జోక్యం పెరిగినట్లు విమర్శలు వస్తున్నాయి. రాజకీయ నేతల సిఫారసులతో మళ్లీ ఉన్న చోటే డ్యూటీ వేయించుకోవడం పరిపాటిగా మారింది. నాలుగు నెలలుగా డ్యూటీ రోస్టర్‌లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగినట్లు నర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. శనివారం విడుదల చేసిన డ్యూటీ రోస్టర్‌లో యురాలజీ, నెఫ్రాలజీ కార్డియాలజీ, సిటీవీఎస్ విభాగాల్లో విధులు నిర్వరిస్తున్నవారినే అలాగే కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. యురాలజీ విభాగంలో ఏకంగా ముగ్గురు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు తిరిగి అక్కడే డ్యూటీ వేశారు. ఇక కార్డియాలజీ విభాగంలో కూడా కొందరు కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పాతుకుపోయారు. ఇదే విభాగంలో ఓ కాంట్రాక్టు మేల్ స్టాఫ్ నర్సు ఏళ్ల తరబడి అక్కడే పని చేస్తుండటం అధికారులకు కనబడటం లేదా అని కొందరు నర్సింగ్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌లో పనిచేస్తున్న నర్సుల స్థానాలను మార్చాలని ఇటీవల డీఎంఈ ఆదేశించినా అమలు కావడం లేదన్న విమర్శలు వస్తున్నారు. ఆసుపత్రి అధికారులకు అనుకూలంగా ఉంటే రోగులు తక్కువగా ఉండే వార్డులు, ఇతరులకు రోగులు ఎక్కువగా ఉండే వార్డుల్లో డ్యూటీ వేస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. కొద్ది రోజుల్లో స్టాఫ్‌నర్సులకు పదోన్నతులు వచ్చే అవకాశముంది. కాగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల ను బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నర్సింగ్ సిబ్బంది అందరికీ అన్ని చోట్ల డ్యూటీలు వేయాలన్న చర్చ జరుగుతుంది.

గత నెలలో ఓ కాంట్రాక్టు స్టాఫ్ నర్సుకు క్యాజువాల్టీలో డ్యూటీ వేయగా పది రోజులు విధులు నిర్వహిచార ఓ మంత్రి సహాయకుడి జోక్యంతో ఆ నర్సును మళ్లీ యథాస్థానానికి పంపినట్లు తెలసింది.

- ఈ విషయమై సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ప్రతి ఒక్కరూ అన్నిచోట్ల పని చేసేలా రోస్టర్ వేయాలని నర్సెస్ అసోసియేషన్ నాయకులు విన్నవించారని, దీని ప్రకారమే డ్యూటీ రోస్టర్‌ను సమూలంగా మార్పు చేశామన్నారు.



HOUSE KEEPING
ఇంటి పనిచేయుటకు క్రిస్టియన్ మహిళ వయస్సు: 45 నుండి 55 సంవత్సరాలు గల మహిళ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెంబర్ : **6303443062.** కర్నూలు
AJL-258062

WANTED
బి.యం. రెడ్డి ఫ్యామిలీ ధాబా నందు పనిచేయుటకు వెయిటర్స్ & సప్లయర్స్ కావలెను. అడ్రస్ : హీరో సస్య షోరూం ఎదురుగా, దుర్గా హోటల్ దగ్గర, బళ్ళారి చౌరస్తా, కర్నూలు. సెల్: **94405 62666**
AJL-247976

DENTAL
రేడియంట్ డెంటల్ క్లీనిక్ : అన్ని రకాల దంత నోటి సంబంధిత వ్యాధులకు ఉత్తమ చికిత్స, EHS ద్వార ప్రభుత్వ ఉద్యోగులకు, క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ కలదు. సంప్ర ఎన్.ఆర్.పేట :**93900 40088.** గాయత్రి ఎస్టేట్స్: **86886 61622.** చెన్నమ్మ సర్కిల్ :**85002 26655**, కర్నూలు.
AJL-236793

WANTED
కర్నూలులో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెంబర్ : **99484 97845**
AJL-247698

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.**
AJA- 246990

CHANGE OF NAME
I, **MUTHAYYAN** (Old Name) H.No: 87/1362-S-P-D-N-60-61Priyadarshini Nagar, kurnool dist. A. P.have changed my name as **MUTHAIAH** (New Name)S/o Nallappa
AJL-247977

FOR ADVERTISEMENTS CONTACT.
Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



తొక్కిసలాటపై ఎంపీ నాగరాజు దిగ్భ్రాంతి



కర్నూలు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాటలో 10మంది భక్తులు మృతి చెందటంపై కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ కర్నూలు బస్సు ప్రమాదం మరవక ముందే మరో దుర్ఘటన చోటుచేసుకోవం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నానని, క్షతగ్రాతులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి



డాక్టర్ రమేష్‌బాబుకు బొకే ఇస్తున్న అధ్యాపకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల ద్వారా మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించాలని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బి. రమేశ్‌బాబు సూచించారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో మానసిక ఆరోగ్య వారోత్స వాలు నిర్వహించారు. సమస్యలను అధిగమించే విషయాలను ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆంజనేయులు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు కోరారు. శనివారం కేకే భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. 6న ఎమ్మిగనూరులో మహసభలకు కార్మికులు తరలిరావాలన్నారు.

ఆరోగ్యాధికారి బాధ్యతల స్వీకరణ



డా.నాగప్రసాద్‌బాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక ప్రజారోగ్య అధికారిగా డా.వై.నాగప్రసాద్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, డీఎస్‌వో క్రిష్ణమోహన్, ఏఎస్‌వోలు శోభారాణి, సరస్వతి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 2007లో చిత్తూరు మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 2021 నుంచి 2025 వరకు గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారు.

పోలీసు శాఖలో పోస్టులను భర్తీ చేయాలి


కర్నూలు న్యూసిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11639 పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ ఎస్‌ఐ నుంచి కానిస్టేబుల్ వరకు మొత్తం 13 కేటగిరీలలో 11,639 పోస్టులు ఖాళీగా ఉన్నాయని హోం మంత్రి నివేదిక ఇచ్చినా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకపో వడం దుర్మార్గమన్నారు. గత వైసీపీ హయాలో 2022లో 411 ఎస్‌ఐ, 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించినా కోర్టు వివాదాల కారణంగా భర్తీ కాలేదన్నారు. టంకం ఏర్పడిందన్నారు. బీసన్న, నాయకులు చంటి, అఖిల్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- కల్లూరు పారిశ్రామిక వాడలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు, చెత్త
- తక్కువ ఎత్తులో ఏర్పాటుతో కార్మికుల ఆందోళన



ఉద్యానవనం కాదు.. ఇదీ కూటీ ట్రాన్స్‌ఫార్మరే..



తగిలితే అంతే.. చేతికి అందేలా..

కల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడ(ఇండస్ట్రియల్ ఎస్టేట్)లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ లేకపోవడంతో ఎప్పుడు ఏం ముచుకొస్తుందోనని పరిశ్రమల యజమానులు, కార్మికులు భయపడుతున్నారు. పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రభుత్వం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను అభివృద్ధి చేసింది. పరిశ్రమల కోసం స్థలం కేటాయించింది. విద్యుత్ సరఫరా చేసేందుకు 180 ట్రాన్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

పెరిగిన రహదారుల ఎత్తు..

పారిశ్రామికవాడ ఏర్పడ్డాక రహదారుల ఎత్తు పెరిగింది, అందుకు అణుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెల ఎత్తును పెంచలేదు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు తగ్గులో ఉండటంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రక్షణ కంచె కరువు

పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచె లేదు. పరిశ్రమల నిర్వాహకులు ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో విడిబాగాలు, ఇనుప వస్తువులు పడుస్తున్నారు. మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన చెత్త, నరికేసిన చెట్ల కొమ్మలు దర్శనమిస్తున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకుంటున్నాం

నగరంలోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది, అదికారులతో నిర్వహణ చర్యలు తీసుకుంటున్నాం. వినియోగదారులు సమస్యను మాకు తెలియజేస్తే పరిష్కరిస్తాం. **- శేషాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆపరేషన్స్, కర్నూలు.**

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయం, డివిజన్ స్థాయిలో కూడా వినతుల స్వీకరణ ఉంటుందన్నారు. తమ సమస్య స్థితిని 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే meeko sam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

విరాళాలు ఇవ్వండి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం త్యాగం చేస్తున్న సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి ఫ్లాగ్‌డేకు విరాళాలు అందజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మహిళా సంఘాలు సేకరించిన రూ.3 లక్షల చెక్‌ను శనివారం జిల్లా సమాఖ్య సభ్యులు కలెక్టర్‌కు అందజేశారు. సభ్యురాలు రూ.10ల చొప్పున రూ.3లక్షలను ఇచ్చారన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.పి.రమణారెడ్డి, సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్, సమాఖ్య అధ్యక్షురాలు కే.సీతాబాయి పాల్గొన్నారు.

ఔషధ నియంత్రణ శాఖ ఏడీగా రమేష్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రమేష్ రెడ్డి నియమితులయ్యారు. నెల్లూరు ఏడీగా పని చేస్తున్న రమేష్ రెడ్డిని బదిలీపై కర్నూలు ఏడీగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కర్నూలు ఏడీగా పని చేస్తున్న రమాదేవిని డీడీగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఆమె స్థానంలో రమేష్ రెడ్డిని నియమించారు.

మెరుగైన విద్య అందించండి

- కలెక్టర్ డా.సిరి.. పంచలింగాల ఉర్దూ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు రూరల్/ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని కలెక్టర్ డా. సిరి ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం పంచలింగాల గ్రామంలో ఉర్దూ ఉన్నత పాఠశాలను ఎంపీ నాగరాజుతో కలిసిన తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆరు, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ఆర్డీవో సందీప్‌కుమార్, రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంతోషం



పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం చిల్లబండ గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఇంటింటికి తిరిగి అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలను పలకరించారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని పేర్కొన్నారు. తల్లికివందనం, ఉచిత బస్సుప్రయాణం, అన్నదాత సుఖీభవ, ఉచితగ్యాస్, పింఛన్ పెంపు, ఉద్యోగాలు, అన్నా క్యాంటీన్ అమలు చేశారన్నారు. గత వైసీపీ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టాలపై నిలబెట్టారని తెలిపారు. ఎంపీడీవో రాముడు, కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి, గంగాధర్‌నాయుడు, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ యల్లప్పనాయుడు, బాషా పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాన్ని ప్రచారం చేయాలి

- మంత్రి టీజీ భరత్.. పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టిశ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న మంత్రి

కర్నూలు అర్బన్, నవంబరు (ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయు గుర్చి భావితరాలకు తెలియజేయాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని అమ్మవారి శాల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, నివాళి అర్పించారు. బాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాటం చేశారన్నారు.

● రాష్ట్రావతరణ ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీకని ప్రిన్సిపాల్ పి. ఇందిరా శాంతి అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ంపొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపల్ జె. హేమంత్, ఎ. సత్యనారాయణ, డా. మాదన్న, పక్కన్నిసాబేగం, డాక్టర్ వి. విద్యా వానీనీ దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..

బహుజన సేవా సమతి అధ్యక్షుడు, టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి కాశెపోగు గిడ్డన్న ఆధ్వర్యంలో పూలబజారులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాగ వీరన్న, నరేష్ యాదవ్, దేవరాజు, బలగం సందీప్, ఈశ్వరయ్య, అన్వర్ బాషా పాల్గొన్నారు.

కర్నూలు: పొట్టి శ్రీరాములు త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందనినగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ అన్నారు. డి.సి.సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఎంఈ మనోహర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, సిబ్బంది రాజు, శ్రీలక్ష్మి, శివశంకర్ పాల్గొన్నారు. జడ్పీలో పరిపాలన అధికారులు మురళీమోహన్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, పుల్లయ్య, బసవశేఖర్, బాబుబాస్కర్ నివాళి అర్పించారు.

కర్నూలు కల్చరల్: కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళి అర్పించారు. లైబ్రేరియన్ బాషా, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, పాల్గొన్నారు.

అవ్వాతాతల మోములో ఆనందమే లక్ష్యం



పూడిచెర్లలో పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవ్వాతాతల మోములో ఆనందమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం పూడిచెర్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పించన్లను పంపిణీ చేశారు. వైసీపీ హయాంలో వలంటీర్లు రెండు, మూడు రోజులు పించన్లు ఇచ్చేవారని టీడీపీ రాగానే ఒక్క రోజులోనే ఇస్తున్నామన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, ఎస్‌ఐ సునీల్ కుమార్, టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి, పుల్లారెడ్డి, ప్రకాశం పాల్గొన్నారు.

10న వాల్మీకి సంకల్ప దీక్ష



కరపత్రాలు విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు డిమాండ్ చేశ్నారు. నవంబరు 10న చేయనున్న దృఢ సంకల్ప దీక్ష కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఆర్మీ, సెక్యూరిటీ రెజ్మెంట్, తలారీగా అవకాశం ఇవ్వాలన్నారు. శ్రీనివాసులు, రామనాయుడు, బేతంకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్యతో సతమతం..

- గూడూరు మండలంలో పత్తి రైతుల అవస్థలు



వ్యవసాయ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఖరీఫ్‌లో 9,900 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. తుఫాన్ ప్రభావంతో పత్తి తడిచిపోయి రైతులు నష్టపోయారు. కనీసం ఉన్న పత్తినైనా అమ్ముకొందామంటే సర్వర్ సమస్యతో పంట నమోదు కావడం లేదు. ఇలా అయితే ఎలా అమ్ముకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

సర్వర్ పని చేయలేదని తిప్పుకుంటున్నారు

సర్వర్ పనిచేయడం లేదని నాలుగు రోజులుగా పత్తి నమోదు చేసేందుకు రైతులను తిప్పుకుంటున్నారు. అధిక వర్షాలతో పత్తికి నష్టం వచ్చింది, ఉన్న కొంతైనా అమ్ముకుందామంటే ఇబ్బందిగా ఉంది. **- రైతు అయ్యస్వామి, గూడూరు**

సర్వర్‌తోనే సమస్య



సర్వర్ సమస్యతోనే పత్తి పంట నమోదు కావడం లేదు. మండలంలో 9,900వందల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. హెక్టారుకు 25 క్వింటాళ్ళ వరకు సీసీఐ కేంద్రంలో కోనుగోలు చేస్తున్నారు. సర్వర్ సమస్య పరిష్కారమయ్యాక నమోదు చేస్తాం.**- దస్తగిరి రెడ్డి, ఏవో**

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తాం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ శాలు రెడ్డి అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ పత్తి ఈ క్రాప్ నమోదులో తాము నిర్లక్ష్యం చేస్తున్నట్లు కొన్ని పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన వార్తలు కల్పితమన్నారు. సబ్ డివిజన్‌లోని కర్నూలు, కల్లూరు, కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో నూరు శాతం పూర్తి చేశామని వివరించారు. గూడూరులో ఏవో రైతు సేవా కేంద్రంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పడం అవాస్తవమన్నారు.

ఆర్‌యూ అధికారుల తీరుపై గాడిదకు వినతి

కర్నూలు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాయలసీమ యూనివర్సిటీ అధికారుల తీరుపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం గాడిదకు వినతి పత్రం ఇచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థు జీవితాలతో చెలగాటమాడుతున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలనిఆధారాలతో ఆందోళన నిర్వహించినా స్పందనలేదన్నారు. ప్రభుత్వ, ఎన్సీటీఈ నిబంధనలు ఉల్లంఘించిన బీఈడీ కళాశాలలను సీజ్ చేసి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అశోక్, అలీ, కమల్, లోకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళా రైతుల అభివృద్ధే ధ్యేయం

సి.బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతుల అభివృద్ధే ధ్యేయం. ప్రభుత్వ ధ్యేయమని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. శనివారం కార్యాలయంలో మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళలు వ్యవసాయం, పాడి పశుపోషణపై దృష్టి సాదించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సన్న కారు రైతులకు ప్రభుత్వం పండ్లతోటలను పెంచుకొవడానికి సబ్సిడీ ఇస్తుందన్నారు.

కూలీలందరికీ పనులు

సి.బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. శనివారం మాట్లాడుతూ వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే అందరికి ఉపాధి పనులు కల్పిస్తామని, ఎవరూ వలస వెళ్లవద్దన్నారు. ఎంపీడీవో కోరారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు.

డీవైఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండు సమీపంలోని కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు శనివారం నిర్వహించారు. నగర కార్యదర్శి హుస్సేన్ బాషా అధ్యక్షతన పతాకాన్ని ఆవిష్కరించారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలన్నారు. టీడీపీ ప్రభుత్వం మాటలతో యువతకు స్వర్గం చూపిస్తోందని విమర్శించారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలాని లేకపోతే మోసం చేసినవారిగా మిగిలిపోతారని హెచ్చరించారు. రాఘవేంద్ర, ప్రకాష్, కిషన్, ఇమ్రాన్, ధను పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ వృత్తి విద్యాజూనియర్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆధ్యాత్మిక భావం ఉండాలి



పాదయాత్రను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే చరిత

కల్లూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆధ్యాత్మిక భావాన్ని పెంచుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి సూచించారు. శనివారం నగరంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో మహా పాదయాత్రను ప్రారంభించారు. శ్రీశైలం ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు పియు.శివమ్మ, పాలూరి శివయ్య, పబ్బతి క్రిష్ణ, పియు మాదన్న పాల్గొన్నారు. పాతబస్టాండ్, కొండారెడ్డి బురుజు, పాత కంట్రోల్ రూం, కిడ్స్ వరల్డ్, రాజవిహార్ సెంటర్, కలెక్టరేట్, సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు మీదుగా పాదయాత్ర సాగింది. 12 రోజుల పాటు పాదయాత్ర అనంతరం నవంబరు 13న తిరుపతికి చేరుకుంటుందన్నారు

గడ్డివాములు దగ్ధం



గొల్లలదొడ్డిలో కాలిపోతున్న గడ్డివాములు

సి.బెళగల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. బాధిత రైతు కరువ సోమన్నకథనం మేరకు.. పశువుల మేత కోసం వెరుశనగ, కొర్ర, వరి, జొన్నతో గడ్డివాలు ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కోడుమూరు నుంచి అగ్నిమాకప సిబ్బంది చేరుకునేలోపే మొత్తం కాలిపోయింది. రూ1.5లక్ష నష్టం వచ్చిందని ఆదుకోవాలని బాధితుడు కోరారు. స్థానికంగా ఫైర్ ఇంజన్ ఉంటే ఇలా అయ్యేది కాదని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గూడూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఎర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సృజనాత్మకతతో అభివృద్ధి..




నమూనాను పరిశీలిస్తున్న ప్రతినిధులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకతతో అభివృద్ధి చెందాలని ప్రైవేటు విద్యాసంస్థల అధ్యక్షుడు వాసుదేవయ్య సూచించారు. శనివారం నగరలోటని కేవీఆర్ గార్డెన్ కేఊవీఆర్ పాఠశాలలో శనివారం స్టూడెంట్ లెర్నింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. యుగంధర్, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డితో కలిసి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ప్రైమరీ ఇన్‌చార్జి జయ, పాల్గొన్నారు.

రిడ్జ్ పాఠశాలలో ఈఎల్‌టీ వర్క్‌షాపు

నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో శనివారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ వర్క్‌షాపు నిర్వహించారు. విద్యావేత్త, రచయిత్రి గాయత్రి కన్నా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీబీఎస్‌ఈలో ఎన్‌ఈపీ-2020కి అనుగుణంగా వచ్చిన మార్పులను ఉపాధ్యాయులకు వివరించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ మ్యాథ్యూస్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న రచయిత్రి గాయత్రి కన్నా





కాశీబుగ్గ ఆలయ దుర్ఘటన బాధాకరం

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన ఘోర విషాద ఘటనపై ఆలూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి శనివారం ఓ ప్రకటనలో దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఎవరూ ఊహించని విధంగా భక్తులు పెద్ద సంఖ్యలో రావడం, భక్తులు ఒత్తిడికి రైలింగ్ పడిపోవడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సత్వర సహాయ చర్యలు చేపట్టారన్నారు. ప్రమాదంపై సోషల్ మీడియాలో కొందరు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు.

ఇళ్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు చేస్తాం

మద్దికెర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మీకు స్థలంతో పాటు పక్కా గృహాలను కూడా మంజూరు చేసిందని, ఇంటి నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో పక్కా గృహం నిర్మాణానికి బిల్లులు మంజూరైనా ఇంటి నిర్మాణం చేపట్టకుండా ఉన్నవారికి నోటీసులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయంలో గ్రామంలో 32 మందికి ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కొంత మందికి బిల్లులు కూడా వచ్చాయని అన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు పొంది కూడా నిర్మాణం పనులు చేపట్టలేదని అన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈఆర్వో స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

త్వరలో అందుబాటులోకి కాస్మో పాలిటన్ క్లబ్

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయ గ్రహణంతో ఏడాది క్రితం మూతపడిన ఆలూరు కాస్మో పాలిటన్ క్లబ్ తెరుచుకోనుంది. రాజకీయ ప్రమేయం లేకుండా రిటైర్డ్ ఉద్యోగులు, న్యాయవాదులు, జర్నలిస్టులతో కలిపి క్లబ్‌ను తిరిగి ఓపెన్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. క్లబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ గత ఏడాది నవంబర్‌లో స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేసి క్లబ్‌కు తాళం వేయించారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగులు కాలక్షేపం పొందేందుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందుపడుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల నుంచి వస్తున్న వినతుల మేరకు క్లబ్‌ను ప్రక్షాళన చేసి ఆటలు ఆడేందుకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. పూర్తిస్థాయిలో రాజకీయ ప్రమేయం లేకుండా చూసేందుకు టీడీపీ నేత వైకుంఠం శివప్రసాద్ యోచిస్తున్నారు. దీంతో విశ్రాంత ఉద్యోగులకు మేలు చేసేవిధంగా క్లబ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆగని వలసలు..



వలస వెళ్తున్న అరికెర గ్రామస్థులు

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లక తప్పడం లేదని ఆలూరు మండలం అరికెర గ్రామస్థులు తెలిపారు. శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్రానికి 10 కుటుంబాలు పిల్లా పాపలతో తట్టా బుట్టా సర్దుకుని వెళ్లారు. ప్రభుత్వం వలసల నియంత్రణకు ఎన్ని సంస్కరణలు తీసుకొస్తున్న వలసలను నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలం చెందుతున్నారు. ఇప్పటికే ఆలూరు నియోజకవర్గంలో అనేక గ్రామాలు వలసలతో ఖాళీ అయ్యాయి. అధికారులు వలసల నివారణకు కనీసం అవగాహన కల్పించడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రాయితీతో పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలి

మద్దికెర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వల్ల రైతులు సాగు చేసిన పప్పుశనగ విత్తనాలు మొలకెత్తలేదని ప్రభుత్వ 80 శాతం రాయితీతో పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు అన్నారు. అధిక తేమ వల్ల నీటి ప్రభావం వల్ల రైతులు సాగు చేసిన పప్పుశనగ పంట వేరుకుళ్లు తెగుళ్లతో చనిపోయిందన్నారు. రైతులు ప్రత్యామ్నా పంటలు సాగు చేసుకునేందుకు పప్పుశనగ విత్తనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఉల్లి పంట సాగు చేసుకున్న రైతులకు వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తి సాగు చేసిన ప్రతి రైతు అమ్మడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని మారెళ్లలో పత్తి పండించిన రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. మండలంలో దాదాపు 3,600 ఎకరాల్లో పత్తి సాగు చేశారనీ, 8 పర్సెంట్ మస్చర్లు ఉన్న పత్తిని క్వింటం రూ.8,100లకు కొనుగోలు చేస్తారన్నారు. ప్రభుత్వానికి అమ్మే ఆసక్తి ఉన్న రైతులు సకాలంలో వ్యవసాయాధికారులతో ఆన్‌లైన్ రిజిస్ట్రేసన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న పత్తి రైతులను మాత్రమే కొనుగోలు చేస్తుందన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు ఆదోని, మంత్రాలయం, వేల్పనూరు, పెంచికలపాడు మార్కెట్‌లలో ఉన్న మిల్లులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతందని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి అన్నారు. శనివారం మండల పరిధిలోని గిరిగిట్లలో వృద్దులు, వితంతవులు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పించన్లు అందించారు. పేదలను ఆదుకోవడం కోసమే ప్రతి నెల 1వ తేదీన పించన్లు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రంలో తెలుగు యువత మండల అధ్యక్షులు సత్యప్రకాష్, గిరిగిట్లమల్లి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈగా మయాంక్

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈగా మయాంక్ అగర్వాల్ బాధ్యతలు తీసుకున్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఓఎస్ డీఈ ఖాన్ ఆధ్వర్యంలో మద్దికెర మండలం ఏఈగా పని చేస్తున్న అగర్వాల్‌ను తుగ్గలి మండల ఏఈగా అదనపు బ్యాతలు ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికటకి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

మహిళా పోలీసుకు మెమో జారీ

వెల్దుర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల అలసత్వం వహించిన సచివాలయ ఉద్యోగికి మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ ఆదివారం తెలిపారు. వెల్దుర్తి సచివాలయం-2 మహిళా పోలీసు సిరాజ్ సిద్దిఖీ ఎన్టీఆర్ భరోసా ఫించన్లను లబ్దిదారులకు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం లేదని బాధితులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు.

నష్టాల బారిన మిరప సాగు



మిరప పంట



రాలిపోయిన మిరప కాయలు

దేవనకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు మిరప వైరస్ బారిన పడింది. ఎర్రతెగుళ్లు, ఆకుముడత, అధిక తేమతో మొక్కలు చనిపోవడం, కాయకు మచ్చ తెగుళ్ల, కుళ్లిపోవడం జరిగింది. ఎకరాకు రూ. లక్ష పెట్టుబడి పెట్టి సాగు చేసినా దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సంరక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి రసాయన మందులతో పిచికారి చేసినా వైరస్ ఆదుపులోకి రావడం లేదు. దీంతో దిగుబడి సగానికి పైనే పడిపోయిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని రైతులు ఈ ఏడాది 600 హెక్టార్లకు పైగా మిరపపంటను సాగు చేశారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా



రెండు ఎకరాలలో మిరప సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెడితే, అధిక వర్షాల వల్ల పంట నష్టపోయాను. గతంలో ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది కురిసిన వర్షాలతో దిగుబడి 20 క్వింటాళ్లు కుడా గగనమే. మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

బంకు శేకన్న, దేవనకొండ

'బాధిత కుటుంబానికి అండగా ఉంటా'



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ

ఆదోని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోటేకల్ గ్రామం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మరణించిన మహిళల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన కపటి గ్రామానికి చెందిన రంగవేణి భౌతికకాయానికి గుడిసె కృష్ణమ్మ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రంగవేణి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం



నివాళి అర్పిస్తున్న ఆవోపా సభ్యులు

ఆదోని టౌన్ , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ ఆవోపా సభ్యులు శనివారం ప్రధాన కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన త్యాగాలను ప్రతి రాష్ట్ర పౌరుడు ఎన్నటికీ మరిచిపోరాదని వక్తలు కొనియాడారు. అనంతరం శంకర్‌నగర్‌లోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు నోటు పుస్తకాలు, పెన్నులను బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా, రఘు, యాదగిరి వెంకటేశ్వర్లు, కుప్పరాజేష్, పాఠశాల హెచ్ఎం వెంకటేష్ ఉపాధ్యాయులు లక్ష్మీ, చక్రవర్తి పాల్గొన్నారు.

ఇంటర్నల్ రోడ్డు పూర్తి చేయాలి

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిని కోరిన బీజేపీ నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హోసూరు నుంచి మొలగవల్లి రైల్వేస్టేషన్ వరకు ఇంటర్నల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు హోసూరు బ్రహ్మయ్య కోరారు. శనివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతిని బీజేపీ నాయకులు బ్రహ్మయ్య, హోసూరు గ్రామస్తులు కలిపి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూ.7 కోట్ల పై చిలుకుతో మొలగవల్లి-హోసూరు రోడ్డు నిర్మాణాన్ని 7 కి.మీ. వరకు తారు రోడ్డు పనులు పూర్తి అయ్యాయన్నారు. అయితే ఆలూరు పరిధిలోకి వచ్చే 2 కి.మీ. మేర రహదారుల (తారు రోడ్డు) పనులు పూర్తిగాకపోవడంతో ఆ రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. నిత్యం పత్తికొండ నుంచి హోసూరు మీదుగా ఆలూరు, మొలగవల్లి ప్రాంతాలకు ఆయా గ్రామాల పంటల పొలాల రైతులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. 2 కి.మీ. మేర నిలిచిపోయిన తారు రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. అందుకు స్పందించిన టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోవర్దన్, నరేష్, హోసూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వైకుంఠం జ్యోతికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ హై స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు. శనివారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలులో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా పోటీలలో అండర్ 17 ఫుట్‌బాల్ పోటీలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శ్వేత, అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి దుర్గా ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణ, రోజాబీలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న పెద్దహరివాణం గ్రామస్థులు

ఆదోని రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెద్ద హరివాణాన్ని మండలంగా ప్రకటించాలని గ్రామ పెద్దలు డిమాండ్ చేశారు. ఇందులోభాగంగా, శనివారం గ్రామ స్వచ్చంద బంద్‌కు పిలుపునివ్వడంతో దుకాణాలు, విద్యాసంస్థలు బంద్ చేశారు. ఆదోని - శిరుగుప్ప బైపాస్ దిగ్బందం చేస్తూ, రోడ్డుపై బైఠాయించారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో విడతల వారిగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో విషయం తెలుసుకొన్న తాలుక సిఐ నల్లప్ప సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని వారిని రోడ్డుపై నుంచి ప్రక్కకు పంపించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ఆలూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణంలోని కోయనగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం ఎంపీడీఓ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సీపీఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కె.పి.నారాయణస్వామి, మైనా, ఐద్వా నాయురాలు షేకున్‌బి, మహేశ్వరి ధర్నా చేస్తున్న మహిళలకు మద్దతు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఆలూరు పట్టణంలో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొందన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయం లేక నీటి సమస్య తలెత్తుతుందన్నారు. గత 15 రోజుల నుంచి ఆలూరులో ఏదో ఒక కలనీలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీవాసులు మహేశ్వరి, లింగమ్మ, లకి&, అశ్విని, భారతి, విజయలకి&, పల్లవి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని డీఎస్ఎఫ్ పట్టణ నాయకుడు నరేంద్ర డిమాండ్ చేశారు. శనివారం డీఎస్ఎఫ్ ముఖ్యనాయకుల సమావేశం ఆర్ట్స్ కళాశాల వద్ద జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతుందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఉదయ్, నవీన్, చంటి, రవి రాకేష్ తిరుమల సందీప్ రాజు నవదీప్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

మద్దికెర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పేదల అండగా ఉంటుందని మాజీ ఎంపీటీసీ సుధాకర్ చౌదరి, మాజీ సర్పంచ్ లక్ష్మన్న, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇమాంసాహేబ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోఎన్టీఆర్ భరోసా పించన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివవంకర్, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆదోని అభివృద్ధికి సహకరించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్నబత్తిన కుబేరనాథ్

ఆదోని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదోని ప్రాంత ప్రగతిపై ఉన్న నిబద్ధతను చాటుతూ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీబీఎల్ అధినేత బత్తిన కుబేరనాథ్ కలెక్టర్ సిరిని మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టరేట్‌లో కుబేర్‌నాథ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదోని డివిజన్‌లో పత్తి పంటను రైతులు అధికంగా సాగు చేశారని తెలిపారు. మంచి దిగుబడులు వచ్చినప్పటికీ పత్తి బేళ్ల ధరలు తగ్గడంతో మార్కెట్‌లో కూడా పత్తి ధరలు తగ్గాయని వివరించారు. ఆదోని ప్రాంత అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అక్కడి ప్రజల అవసరాలపై వివరించినట్లు తెలిపారు. ఆదోనిలో స్థానిక సమస్యలను పరిష్కరించడానికి ఉన్న సామర్థ్యాన్ని ఆవశ్యకతను ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఆదోని ప్రాంతం ప్రగతి పథంలో నడవాలంటే ఆదోని జిల్లా కేంద్రం అయితే పరిష్కారమవుతుందన్నారు. బాగా వెనుకబడ్డ ప్రాంతమైన పశ్చిమ ప్రాంతం ఆదోనిని ఎక్కువ వలసలు వెళతారని, అందుకే జిల్లా కేంద్రం అయితే అభివృద్ధి దిశగా ఆదోని అభివృద్ధి చెందుతుందని కలెక్టర్‌కు వివరించారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు



మన్మథ విజయ్

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మన్మథవిజయ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మహబూబ్‌బాషాను వీఆర్‌కు పంపుతూ, కర్నూలు డీటీసీలో ఉన్న మన్మథ విజయ్‌ను ఆలూరుకు నియమిస్తూ ఉన్న తాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టి సారిస్తున్నామన్నారు. మట్కా, పేకాట వంటిఅసాంఘీక కార్యకలాపాలపై నిఘా ఉంచుతామన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు, మీడియా సహకారం అవసరమన్నారు.

పెద్దతుంబళం ఎస్.ఐగా మల్లికార్జున



మల్లికార్జున

ఆదోని రూరల్ : ఆదోని మండలం పెద్ద తుంబళం ఎస్ఐగా మల్లికార్జున బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా, కర్నూలు టూటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున పెద్దతుంబళంకు, పెద్దతుంబళం లో ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

వెల్దుర్తి: వెల్దుర్తి ఎస్ఐగా ఎం.నరేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బ్రహ్మగుండంలో కామేశ్వరీ సహిత బ్రహ్మేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ నుంచి వెల్దుర్తికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అశోక్ గూడురు మండలానికి బదిలీ అయ్యారు.



ఎం.నరేశ్

10న మార్కెట్ యార్డు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్‌యార్డు పాలకవర్గ ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఈనెల 10న ఆలూరు మార్కెట్‌యార్డులో జరుగుతుందని ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేష్ శనివారం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీర్వాదంతో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

రైతు బిడ్డకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఇమామ్‌వలి

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో జన్మించి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని బీటెక్ పూర్తిచేసి పీహెచ్‌డీతో డాక్టరేట్ పట్టాను తీసుకుని శనివారం పలువురితో శభాష్ ఇమామ్‌వలి అనిపించుకున్నారు. మండల పరిధిలోని జొన్నగిరి చెందిన షేక్ కాశీం సాహేబ్, పీబీల కుమారుడు ఇంజనీరింగ్‌లో ఈఈ-సీఈవీ చదువకుని ఎంటెక్ చేసి యాంటినాస్(స్నూప్ సర్ఫేస్ ప్లాస్మోన్ పోలేరిటన్ డివైసెస్ ఫర్ బయోసైన్సింగ్ అప్లికేషన్) రంగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. .ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డాక్టరేట్ అందుకున్నాడు. దీంతో గ్రామంలో సంబ్రమాశ్చర్యాలు చేసుకోవడంతో పాటు పత్రి ఒక్కరూ అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న చందూ నాయక్

తుగ్గలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయులు ఆగస్టీన్, పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఖో-ఖో, కబడ్డీ పరుగు పందెం క్రీడల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు డివిజన్ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల శ్రీనివాసులు, సుధాకర్‌గౌడు, ఆలి, గంగావతి పాల్గొన్నారు.

పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోండి

మద్దికెర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్, రబీలో సాగు చేసిన రైతులు కంది పంటలో పూత రాలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవి తెలిపారు. శనివారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, బీఎన్ పేట గ్రామాల్లో కంది పంటను పరిశీలించారు. కంది, వేరుశనగ పూత రాలడాన్ని నివారించడానికి ప్లానా సిక్స్-4 గ్రాములు పది లీటర్ల నీటికి కలిపి పంటలపై పిచికారి చేయాలన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఎమ్మిగనూరు వైసీపీలో అసమ్మతి జ్వాల..!

- ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా రాజీవ్‌రెడ్డిని ప్రకటించిన జగన్
- జీర్ణించుకోలేని ఆ పార్టీ సీనియర్ నాయకులు
- ప్రత్యేక కుంపటి పెట్టే ఆలోచన
- నందవరం మండల కన్వీనర్ ఇంట్లో ప్రత్యేక భేటీ
- బుజ్జగించేందుకు సన్నిహితులను పంపించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట

కర్నూలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజవర్గం వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుకను తొలగించి.. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి స్వయాన మనవడు కడిమెట్ల రాజీవ్‌రెడ్డిని ఇన్‌చార్జిగా అ పార్టీ అధిష్టానం నియమించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన చేనేత మహిళ బుట్టా రేణుకను రాజకీయంగా జగన్ బలి పశువు చేశారని, వైసీపీలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఉండదని బీసీలు ముఖ్యంగా చేనేతలు రగిలిపోతున్నారు. ఈ జ్వాల ఆరకముందే ఆ పార్టీలో అసమ్మతి సెగ తారాజువ్వలా లేచింది. పెద్దాయన, రాజకీయ కురువృద్ధుడు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిపై ఉన్న గౌరవంతో ఆయన కోసం.. ఆయన గెలుపు కోసం ఇన్నాళ్లు పని చేశాం. ఆయన కొడుకు కోసం కూడా రాజకీయంగా కష్టపడ్డాం.. ఇప్పుడు పాతికేళ్లు వయసు లేని మనవుడిని తెచ్చిపెట్టి పని చేయమంటే ఎలా చేసేది..? తరతరాలు వారి కుటుంబానికి ఊడిగం చేయాలా..? ఇన్‌చార్జిగా ఉంటే బుట్టా రేణుక ఉండాలి.. లేదంటే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఉండాలి. మూడో తరం పిల్లాడి వద్ద కూడా పని చేయమంటే ఎలా చేయగలం..? మన రాజకీయ భవిష్యత్తు కోసం బలమైన నిర్ణయం తీసుకోక తప్పదంటూ తెగేసి చెబుతున్నట్లు సమాచారం. బీసీ మహిళకు రాజకీయంగా తీరని ద్రోహం చేసి మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట మనవడు రాజీవ్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన రోజే నందవరం వైసీపీ మండల కన్వీనర్ శివప్పగౌడ్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం ఇన్‌చార్జిగా నియమితులైన రాజీవ్ రెడ్డి ఓ వైపు విలేకరుల సమావేశం నిర్వహించగా.. మరో వైపు ఆ సీనియర్ నాయకులు సమావేశమై జట్టుకట్టి అసమ్మతి జెండాను ఎగురవేయడం కొసమెరుపు.



రాజీవ్‌రెడ్డి



బసిరెడ్డి

అల్లుడే అసమ్మతి టీం లీడర్..!

ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడు కడిమెట్ల రాజీవ్‌రెడ్డి నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ఎర్రకోట సొంత అల్లుడు ఎమ్మిగనూరు వైసీపీ మండల కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి, నందవరం ఎంపీపీ లక్ష్మీదేవమ్మ కుమారుడు, ముగతి సర్పంచి విరుపాక్షిరెడ్డి, ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, అగ్రహారం సర్పంచి రంగారెడ్డి, నందవరం మండల వైసీపీ కన్వీనర్ శివప్పగౌడ్, ఆ పార్టీ సీనియర్ నాయకులు హాలహర్వి రాంకోటి రెడ్డి, కనకవీడు పేట శ్రీనివాసరెడ్డి సహా పలువురు సీనియర్ నాయకులు శనివారం ఎమ్మిగనూరులో ప్రత్యేంగా భేటీ అయ్యారు. ఇన్‌చార్జిగా రాజీవ్‌రెడ్డి ఎంపికను తీవ్రంగా వ్యతిరేకించారు. తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకొని జగన్‌తో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సీనియర్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోకుండా పాతికేళ్ల పిల్లాడే మీ ఇన్‌చార్జి అంటే ఆయనతో కలసి ఎలా పని చేయలగమని ఘాటుగా స్పందించినట్లు తెలుస్తుంది. 'గత ఎన్నికల్లో అధిష్టానం బుట్టా రేణుకకు టికెట్ ఇస్తే, పెద్దాయన ఎర్రకోటకు ఇవ్వాలని మొదట్లో వ్యతిరేకించాం.. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఆమె గెలుపు కోసం పని చేశాం. గతంలో ఎంపీగా పని చేసిన అనుభవం ఉండడడంతో ఇన్నాళ్లు బుట్టారేణుకతో కలసి పని చేశాం. ఆమె కూడా దూసుకుపోయి బలంగా పని చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఉన్న ఫలంగా ఏమాత్రం రాజకీయ అనుభవం లేని వ్యక్తి తెచ్చిపెడితే ఆయన వద్ద పని చేయడం ఎలా సాధ్యం..? రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా ఎదుర్కొగలం..' అంటూ అసమ్మతి సెగలు రాజేస్తూ ప్రత్యేక కుంపటి పెట్టేందుకు సై అంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ అసమ్మతి జట్టుకు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట అల్లుడు, ఇన్‌చార్జిగా ఎంపికైన రాజీవ్‌రెడ్డి సొంత మేనమామే నాయకత్వం వహించడం కొసమెరుపు.

బుజ్జగింపుల పర్వం:

ఎమ్మెల్యే ఎర్రకోటకు మనవడికి ఇన్‌చార్జి పదవి వచ్చిందనే సంతోషం లేకుండా అసమ్మతి కుంపటి రాజేయడంతో ఆయన మేల్కొన్నాడు. 'అసమ్మతి వద్దు.. రండి మాట్లాడుకుందాం..! ఇన్నాళ్లు మీకు ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చానో.. అదే ప్రాధాన్యత ఉంటుంది..' అంటూ అల్లుడు బసిరెడ్డి, ఇతర నాయకులకు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట స్వయంగా ఫోన్ చేయడమే కాకుండా బుజ్జగింపు కోసం సన్నిహితులను పంపినట్లు తెలుస్తోంది. 'ఇన్‌చార్జిగా రాజీవ్‌రెడ్డిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించబోమని, ఉంటే మీరైనా ఉండాలి.. లేదంటే మాజీ ఎంపీ బుట్టా రేణుక అయినా ఉండాలి.. మూడో వ్యక్తిని ఎట్టి పరిస్థితులోనూ ఆమోదించేది లేదు..' అని తెగేసి చెప్పిట్లు తెలుస్తోంది. పెద్దాయన ఫోన్ చేయడంతో ఆయనపై గౌరవంతో కలసి వద్దాం.. ఆయన ఏం చెబుతారో విందాం.. మన ఆలోచనలకు అనుగుణంగా పెద్దాయన స్పందిస్తే ఒకే.. కాదుకూడదంటే సోమవారం మరోసారి సమావేశమై అధిష్టానంతో తాడోపేడో తేల్చుకుందాం..' అని అసమ్మతి జట్టు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నేడు ఎర్రకోటతో అసమ్మతి నేతల భేటీలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు..? వైసీపీలో ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

మహాయాగంలో ఎమ్మెల్యే బీవీ



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శ్రీకృష్ణపీఠం పీఠాధిపతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో విశ్వశాంతి మహాయాగంలో భాగంగా రెండో రోజు మహాగణపతి, సుదర్శన రుద్రహోమాలు, రమాసతి సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. హోమాల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి యాగాన్ని ప్రారంభించేందుకు తనకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, మాచాని మహేశ్, మాచాని శివశంకర్, మహేంద్ర బాబు, మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, కేఎండీ ఫారుక్, మద్దిలేటి, నవీన్, జగదీష్, బీజేపీ నరసింహులు, నిర్వాహకులు సత్యనారాయణ రెడ్డి, రాము, వడ్డే వీరేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్న 87వ విశ్వశాంతి యాగానికి కర్నూలు కలెక్టర్ సిరిని యాగ కమిటీ సభ్యులు మహేంద్ర బాబు, బుగిడే నాగరాజు ఆహ్వానించారు. శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచనలతో కర్నూలులోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మహాయాగానికి రావాలని ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘువేంద్ర రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో రాఘువేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ మంత్రాలయంనియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్ర రెడ్డి అన్నారు. మండలంలోని మాధవరం తన నివాసంలో బాధిత కుటుంబాలకు రాఘువేంద్ర రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మంచాల సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మంత్రాలయం మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్ రెడ్డి, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, అయ్యన్న, సురేష్ నాయుడు, ఏసేబు, ఆధ్వర్యంలో 42 మందికి రూ.16,95,983 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోసిగి మండలానికి 17 మందికి రూ.7,02,091 చెక్కును, కౌతాళంలో ముగ్గురుకి రూ.74,400, మంత్రాలయం మండలంలో 13 మందికి రూ.5,25,397, పెద్దకడుబూరులో 9మందికి రూ.3,94,095 చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు రాఘువేంద్ర, లక్ష్మన్న, సతీష్ నాయుడు, జ్ఞానేష్, ఈరన్న, భీమిరెడ్డి, నాగరాజు, కేశన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లుల చెంతకు పిల్లలు

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘువేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తప్పిపోయిన ఇద్దరు పిల్లలను వారి తల్లుల చెంతకు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, సిబ్బంది చేర్చారు. శనివారం బెంగళూరుకు చెందిన సుశ్మిత రెండున్నరేళ్ల వయస్సు గల కూతురు సంస్కృతి, కర్ణాటకలోని తుంకూరు చెందిన నందిని కొడుకు తేజశ్ (7) తప్పిపోయారు. తల్లిదండ్రులు తుంగభద్ర నదితీరం, ప్రధాన రహదారులు, బస్టాండులు గాలింపు మొదలు పెట్టారు. వేరువేరు చోట్ల చిన్నారి సంస్కృతి, తేజశ్‌లు ఏడుస్తూ ఎంటీఆర్ లైన్‌లో కనిపించిన పిల్లలను అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎల్లప్ప చేరదీసి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే శ్రీమఠంలో ఉన్న మైక్ అనౌన్స్‌లో ఇద్దరు పిల్లలు క్షేమంగా ఉన్నారని చెప్పడంతో పిల్లల కోసం గాలిస్తున్న తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి గుర్తించారు. తప్పిపోయిన బాలిక సంస్కృతి, బాలుడు తేజశ్‌ను తల్లులకు అప్పగించడంతో పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కోసిగి ఎస్ఐగా రమేశ్ రెడ్డి



కోసిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఎస్ఐగా డి.రమేశ్ రెడ్డి శనివారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లాలో మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కోసిగికి బదిలీయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ హనుమంతరెడ్డి కర్నూలు టూటౌన్‌కు బదిలీ అయ్యారు. ఎస్ఐ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురువులను గౌరవించాలి

ఎమ్మిగనూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గురువులను గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని జీనియస్ గ్లోబల్ ఇనుస్టూట్ నిర్వాహకులు గంగాధర్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఉప్పర కమ్యూని హాల్‌లో గురువులకు వందనం అనే కార్యక్రమాన్ని పాఠశాల నిర్వాహకులు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో గురువులను భక్తితో గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటి చెప్పేలా భరతనాట్య ప్రదర్శన చేశారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయునులకు జ్ఞాపికలను అందజేసి అభినందించింది.

క్రీడలకు ప్రోత్సాహం



ట్రోఫీని అందజేస్తున్న సర్పంచ్ భీమయ్య

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో రాంపురంరెడ్డి సోదరులు ఆధ్వర్యంలో క్రీడలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పూడూ అందిస్తామని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. దీపావళి సందర్భంగా నిర్వహిస్తున్న హెలిప్యాడ్ మైదానంలో డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంటు పోటీలు శనివారం ముగిశాయి. నిలిచిన ఎమ్మిగనూరు ఎలెవెన్ టీమ్‌కు రూ.30 వేల నగదు, రన్నర్‌గా నిలిచిన మంత్రాలయం సుశమీంద్ర ఎలెవెన్ జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. గ్రామీణ స్థాయిలో క్రీడలకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి, ప్రదీప్ రెడ్డి, ధరణిరెడ్డి, ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. అంతకుముందు సర్పంచ్‌కు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. వైసీపీ నాయకులు గుడేకల్ మారెప్ప, రామాంజనేయులు, ఆర్గనైజర్లు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు టాలెంట్ టెస్ట్

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి ఆకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్ఫూర్తి మెమోరియల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వైష్ణవి ఆకాడమీ చైర్మన్ విష్ణుప్రభు తెలిపారు. పట్టణంలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. వైష్ణవి జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థిని విద్యార్థులకు తమ ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోగలరని అన్నారు. ఉదయం 9-45 ని కొండవీటి ప్రాంతంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లను 9908967858, 9885152082లకు సంప్రదించాలన్నారు.

బ్యాంకు సందర్శన

మంత్రాలయం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రచ్చుమర్రి మోడల్ స్కూల్ పాఠశాల నుంచి 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్, వృత్తి విద్యా విద్యార్థులు బ్యాంకు సందర్శనకు వెళ్లారు. మంత్రాలయంలోని స్టేట్ బ్యాంకులో మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకు సేవలు నిర్వహణ, సౌకర్యాలు, వివిధ రకాల లోన్లు, డబ్బు, బంగారు, ఇతరత్రా భద్రతా ప్రమాణాల గురించి వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇలాంటి అవగాహనతో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రసాద్, పంపయ్య, మైమూద్, షరీఫ్ వలి, రవిబాబు, నళిని, సోమలింగం, వైష్ణవి, భాగ్యలక్ష్మి, తదితరులు ఎన్నారు.

రాష్ట్ర దశను మార్చే నేత సీఎం చంద్రబాబు



పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

కోసిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దశను మార్చే నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని.. సూపర్ సిక్స్‌లో భాగంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాదిన్నరలోపే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘువేంద్ర రెడ్డి అన్నారు. మండలంలోని దొడ్డి గ్రామంలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మాల పద్మమ్మ నేతృత్వంలో పింఛన్లు పంపిణీ చేశారు. రాఘువేంద్ర రెడ్డి అర్హులందరికీ పింఛన్లు అందేలా చూస్తామన్నారు. టీడీపీ యువ నాయకుడు రాకేష్ రెడ్డి, సీఐ మంజునాథ్, ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వర్‌రావు, నాయకులు అయ్యన్న, నర్సారెడ్డి, జ్ఞానేష్, రామకృష్ణ, మాజీ జడ్పీటీసీలు రాముకృష్ణ, వక్రాణి వెంకటేశ్, ఈరన్న, కోసిగయ్య, రంగారెడ్డి, గోపాల్, గుండేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఆహ్వానం లేదు



మాట్లాడుతున్న డి.బెళగల్ సర్పంచ్ పద్మమ్మ, నాయకులు

కోసిగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి తమకు ఆహ్వానం అందలేదని డి.బెళగల్ గ్రామ సర్పంచ్ మాల పద్మమ్మ, టీడీపీ నాయకులు వీరారెడ్డి, మాదేవ, రామయ్య, ఎంపీటీసీ రాజు అన్నారు. శనివారం కోసిగిలో వారు విలేకరుల మాట్లాడుతూ డి.బెళగల్ గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా అవమానపరిచారని అన్నారు. నాయకులు కూడా పార్టీ కార్యక్రమాలకు రావాలని ఆహ్వానించడం లేదని ఆరోపించారు. పార్టీ కోసం పని చేశామని, తమను కూడా అభివృద్ధి, పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతు, దేవన్న, రాజశేఖర్ రెడ్డి, హుశేనీ, మాదేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉల్లి పంట

గోనెగండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటకు గిట్టు బాటు ధర లభించక పోవడంతో పశువులకు వదిలేస్తున్నారు. గోనెగండ్లకు చెందిన సుంకన్న ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని ఉల్లి పంటను సాగు చేశాడు. అయితే శనివారం మూగజీవాలకు గ్రాసంగా వదిలారు. తాను ఐదు ఎకరాలకు గాను కౌలు రూ. 2లక్షలు పంట పెట్టబడి రూ. 5లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. క్వింటం ఉల్లి ధర రూ. 600 నుంచి రూ. 1000 లోపు ఉండటంతో రైతులు చేసేది లేక గ్రాసంగా వదిలివేశారు. గోనెగండ్లకు చెందిన 5మంది ఉల్లి రైతులు దాదాపు 15 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను మూగజీవాలకు గ్రాసం వదిలివేశారు. ఒక్కొక్క ఎకరంకు రూ. 70 నుంచి రూ. 90వేల వరకు పెట్టబడి పెట్టారు. మండలంలో దాదాపు ఇప్పటికి 200 ఎకరాలు లలో సాగు చేసిన ఉల్లిని మూగజీవాలకు మేతగా వదలడం, ట్రాక్టర్‌తో పంటను దున్నివేయడ జరిగిందని రైతులు తెలుపుతున్నారు. మరికొన్ని పొలాల్లో గ్రామస్థులు ఉచితంగా ఉల్లిని కోసుకొని తీసుకెళ్తున్నారు.



ఉల్లి పంటను మూగజీవాలకు మేతగా వదిలిన దృశ్యం

ప్రజల మేలు కోసమే రాజకీయాల్లోకి వచ్చాను

● వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ రెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి అన్నారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ కుటుంబంపై ఎంతో నమ్మకంతో తనను ఇన్‌చార్జిగా నియమించారని అన్నారు. వర్గవిభేదాలు లేకుండా అందరినీ కలుపుకొని ముందుకెళ్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చెన్నకేవరెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తనను ఆదరించిన ట్లే తన మనవడు రాజీవ్ రెడ్డిని ఆదరించాలని కోరారు. సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు సోగనూరు భీమిరెడ్డి, రిజయాజ్, నారాయణ రెడ్డి, నాగేశప్ప, కాశీం బేగ్, గిడ్డయ్య, ఎంపీపీ కేశన్నలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మాచాని సోమప్ప స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఘనంగా నిర్వవహించుకున్నారు. పట్టణంలోని మాచాని సోమప్ప స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకొవడానికి ఇది ఒక అవకాశమన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, మరియు భద్రతను ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కళ్యాణీ, మణి గౌతం పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

గోనెగండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం ఈశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో పూజలు చేశారు. గోనెగండ్లలోని నీలకంతేశ్వరదేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహంచారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

అధిక లోడ్‌తో వెళ్తే చర్యలు



పత్రాలను పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు అధిక లోడ్‌తో ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మండలంలోని ఎర్రకోట రహదారిలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరు తమకు ఓ కుటుంబం ఉందని గుర్తించుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీ విక్టర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి



కున్నూరు చెరువుకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కున్నూరు గ్రామంలో శనివారంఆయన పర్యటించారు. మాచాపురం, కున్నూరు గ్రామాల మద్య ఉన్న చెరువు నీటి తో నిండి ఉండటంతో చెరువులో గంగ పూజలు చేసి జలహారతి ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టితో సమస్య తీరిందని, పంటలు సకాలంలో పండించుకోవాలని సూచించారు. గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వీధులలో తిరిగి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాల అభివృద్ధి జరగలేదన్నారు. ఎంపీఎస్ స్కీం కింద రూ. 19.5 కోట్లతో 14 గ్రామాలకు తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గోనెగండ్లతో పాటు పలు గ్రామాలలో జలజీవన్ మిషన్ తో తాగునీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రభుత్వంలోనే స్థానిక ప్రజాప్రతినిధులకు గ్రామాభివృద్ధికి నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏడాది కాలంలో గోనెగండ్ల మండలంలో రూ. 4.65 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. ఆర్డీఎస్ కెనాల్ ద్వారా మన ప్రాంతంలో 40వేల ఎకరాలకు నీరు అందిస్తుందని క్యాబినెట్‌లో సీఎం ఆర్డీఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి కున్నూరు రమణచౌదరి, హెచ్‌కైరవాడి సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, నజీర్‌సాహెబ్, రాంపురం రఫీక్, రమేష్ నాయుడు, ఐరన్‌బండ బాషా, బీజేపీ మండల కన్వీనర్ మునిస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ల రద్దు కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రమ దోపిడి నుంచి కార్మికులను విముక్తి చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయంగా 8గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటల పని విధానం జీవోను అసెంబ్లీ తీర్మానించడం వల్ల కార్మిక వర్గం మొత్తం వ్యతిరేకించిందని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాముడు, గోవిందు, యు రమేష్, సురేష్, నాగలక్ష్మీ, గోవర్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి : డీవైఎఫ్ఐ



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి ఇవ్వాలని డీవైఎఫ్ఐ నాయకులు రాముడు, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో డీ వైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా జిల్లాలో పరిశ్రమలు, జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగి భృతి ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రాయలసీమకు పరిశ్రమలను తెచ్చి ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ హబ్‌గా తిర్చిదిద్దుతామని హామాలు ఇచ్చారన్నారన్నారు. 2025లో టెట్ ఫీజు రూ.1,000 ఫీజు పెట్టడం దారుణమని, ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, రాకేష్, మోహన్, చందు తదితరులు పాల్గొన్నారు.